


# గృహప్రవేశం

## ప్రతాప రవిశంకర్

నూతన గృహప్రవేశం- అంటూ ఓ కార్డు ఆ రోజు పోస్టులోనే వచ్చింది. ఎంత అందంగా వున్నాయని ఆ అక్షరాలు! రంగులమీద తళుకు అద్దిన అక్షరాలు- తప్పక విచ్చేయమని ఆహ్వానం.

"ఏమిటీ! సాంబమూర్తి కొత్తఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేస్తున్నాడా!" అనడిగింది మా ఆవిడ నమ్మలేనట్టు...

"అవును... ఈ కార్డులో అలాగే వుంది. ఇది హాస్యానికి పంపిన ఆహ్వానం కాదు. అందువల్ల నువ్వు నమ్మక తప్పదు" అన్నాను

మా ఆవిడ ఇంతగా ఎందుకు ఆశ్చర్య పడిపోయిందంటే సాంబమూర్తి మా అందరి దృష్టిలో ఒక్క పూటకూడా భార్యా, ముగ్గురు పిల్లలకు తిండిపెట్టలేని వాడు. అలాంటి మనిషి సొంత ఇల్లు కట్టుకుంటున్నాడంటే ఎవరికైనా వింతగానే వుంటుంది-

సాంబమూర్తి మాకు దగ్గరిబంధువే మరీ ఎక్కువగా చదువుకోని మనిషి-రకరకాలైన చిన్న చిన్న ఉద్యోగాలు చేసేవాడు. ఏ ఒక్క ఉద్యోగంలోనూ స్థిరంగా వుండేవాడు కాదు. ఎక్కువ రోజులు ఖాళీగానే వుండేవాడు. ఖాళీగా వుండే ఉద్యోగమంటేనే సాంబమూర్తికి ఇష్టమని ఎప్పుడైనా మేమంతా కలిసినప్పుడు అనుకునే వాళ్ళం.

ఐతే ఎంత పేదరికాన్ని అనుభవిస్తున్నా సాంబమూర్తి చలాకీగా వుండేవాడు. బాధపడుతున్న మనిషిలా కనపడే మనిషి కాదు. మాటలతో ఎదుటి వాళ్ళను గంపలో వేసే తెలివితేటలు బాగా వున్నాయని నా నమ్మకం-

అతని భార్యమాత్రం ఎప్పుడూ బాధపడుతూనే కనిపించేది. అందులో ఆశ్చర్యం లేదు. సాంబమూర్తిలాంటి భర్తను పొందినందుకు ఆమెకు మిగి

లింది బాధ వొక్కటే అని మాకూ బాధ గానే వుండేది-

ఎప్పుడైనా మా ఇళ్ళల్లో ఏవైనా శుభ కార్యాలు జరిగినప్పుడు తప్పకుండా సాంబమూర్తి భార్యా పిల్లలతో హాజ రయ్యేవాడు. ఒళ్ళు దాచుకోకుండా అతని భార్య ఏదో ఒక పని అందర్లో కలిసి పోయి చేస్తుండేది. ఎవరైనా కదిలిస్తే తన గొడ అంతా చెప్పుకుని 'ఈ జన్మకు నాకీ బాధలు తప్పవు... అంతే' అనేది చివరగా.

ఆమె సాంబమూర్తి గురించి తన మనసును గట్టిగా మార్చుకుంది- ఇక తన జీవితం ఇంతే అనుకుంది.

కాని- ఆశ్చర్యం! అతి తక్కువ వ్యవధిలోనే సాంబమూర్తి ఆమె జీవి తాన్ని మార్చేశాడు...జీర్ణించుకుపోయిన ఆమె నిరాశను కరిగించి గొప్ప ఆశా జ్యోతిని వెలిగించాడు.

అందుకు నిదర్శనమే- ఈ నూతన గృహప్రవేశ ఆహ్వానం!

ఐనా ఓ మనిషిని అదృష్టం నెట్టుకు రావటానికి ఎంత సమయం కావాలి? బికారులు కుబేరులుగా మారిన సంఘట నలు ఈ చరిత్రలో ఎన్నో వున్నాయి. అందులో సాంబమూర్తి చరిత్ర ఒకటి- ఐతే సాంబమూర్తి పూర్తిగా కష్టపడి పైకివచ్చాడనీ, ఇల్లు కట్టుకునేంతగా సంపాదించాడనీ నేను అనుకోను. అతను తన తెలివితేటలతోనే పైకి వచ్చాడని అనగలను

ఏది ఏమైనా ఆ ఆహ్వానం నాకు సంతోషాన్నే పూర్తిగా కలిగించిది. మా బంధువుల్లో అడుగున జీవిస్తున్న ఓ మనిషి కొంచెం పైకి ఎదిగాడు. ఇది కోరుకోదగినదే-

అన్నింటినీ మించి అతని భార్య బాధలను ఈ జన్మలోనే నిర్మూలించ గలిగాడు.

గృహప్రవేశం ఇక నాలుగు రోజులే వున్నది-

"మన బంధువుల్లో ఈ ఆహ్వానాలను అందుకున్నవాళ్ళంతా మనలాగే ఆశ్చర్య పోతారు" అన్నది మా ఆవిడ.

"అవును." అన్నాను

"ఇంతకీ ఈ డబ్బంతా ఆ కాంట్రా క్టులోనేసంపాదించాడంటారా?" అన్నది.

"అవును. అంతకుమించి మరో దారి లేదు." అన్నాను.

ఆ తర్వాత మా ఆవిడ ఏదో అడి గింది కానీ నేను వినిపించుకోలేదు.

ఎవర్ని పట్టుకున్నాడో- ఎలా వల్లో వేసుకున్నాడో సాంబమూర్తి కాంట్రాక్ట రుగా మారిపోయి చిన్నచిన్న కాంట్రా క్టులు చెయ్యటం మొదలుపెట్టాడు. ఒక సారి వాళ్ళ వూరు వెళితే సైకిలుమీద ఎక్కడికో రివ్వున వెళుతూ నన్ను చూసి ఆగిపోయాడు.

"ఎక్కడికీ పరుగు? ఇప్పుడేం చేస్తున్నావ్?" అనడిగాను సాంబమూర్తిని-

"ఏవో చిన్న చిన్న కాంట్రాక్టులు చేస్తున్నాను. ఐనా నా గురించి నా ఉద్యోగాల గురించి నీకు తెలుసు కదా" అంటూ నవ్వాడు.

నేనేదో అడగాలనుకున్నాను.

ఇంతలోనే "పనుంది, వస్తాను" అని నా జవాబుకోసం ఎదురుచూడకుండా సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

అప్పుడు నేను సాంబమూర్తి ఎవరో కంట్రాక్టరు దగ్గర పనిచేస్తున్నాడనీ నాకిలా చెప్పాడనీ అనుకున్నాను. కాని ఆ తర్వాత మా బంధువొకాయన మా ఇంటికొచ్చినప్పుడు సాంబమూర్తి నిజంగానే చిన్నచిన్న కంట్రాక్టులు చేస్తున్నాడని చెప్పాడు...

మొత్తానికి సాంబమూర్తి డబ్బు సంపాదించే మార్గంలోకి ప్రవేశించాడు...

దాని ఫలితమే ఈ గృహప్రవేశం...

క్రితంరోజు సాయంత్రమే నేను మా ఆవిడ సాంబమూర్తి వూరికి బయల్దేరాం.

* * *

రాత్రి పదిగంటలకు మేము వెళ్ళేసరికి సాంబమూర్తి మాకు ఎదురువచ్చి నవ్వుతూ ఎంతో అభిమానంగా మమ్మల్ని ఆహ్వానించాడు- ఆయన భార్య కూడా.

సాంబమూర్తి వేషభాషల్లో అంతగా మార్పు కనిపించలేదు కాని ఆయన భార్యలో గొప్ప మార్పు చాలా సులభంగానే కన్పించింది.

ఆమె ఖరీదైన బట్టలు ధరించింది... మెళ్ళో కొన్ని నగలు కూడా వున్నాయి. మొహంలో ఒకప్పటి విచారం - బాధ కొంచెం కూడా కనపడ లేదు. వాటి స్థానంలో సుఖం, సంతోషం కళ్ళలో కొత్తవెలుగు కనిపించాయి.

ముగ్గురు పిల్లలూ కొత్త బట్టలు వేసుకున్నారు. ఇంతకుముందుఎప్పుడూ వాళ్ళు చిరుగుల బట్టలే వేసుకునేవాళ్ళు-

ఏమైనా వాళ్ళంతా నూతన గృహంలోకే కాకుండా నూతన జీవితాల్లోకి కూడా ప్రవేశిస్తున్నట్టు అనిపించింది.

బంధువులందరం ఒకసారి అక్కడికి దగ్గర్లోనే వున్న నూతన గృహాన్ని ఒకసారి చూసి వచ్చేశాం... విశాలంగానే వున్న డాబాఇల్లు, దాన్ని రంగురంగుల లైట్ల తోరణాలతో అలంకరించారు.


తెల్లవారుజామున గృహప్రవేశం.

భోజనాలు అవగానే కొంతమంది బంధువులం ఒకచోట కూర్చుని సాంబమూర్తి తెలివితేటలను, అదృష్టాన్నీ గురించే ఎంతో సేపు చర్చించుకున్నాం-

"దేనికైనా అదృష్టం కలిసిరావాలి" అన్నాడొకాయన.

"అంతేకాదు. తెలివితేటలు కూడా వుండాలి."

"ఎన్నయినా చెప్పండి. ఇదంతా




న్యాయంగా సంపాదించిన డబ్బు కాదు. అన్యాయంగా ఆర్జించిందే."

"అలా అంటే నేను ఒప్పుకోను. అన్యాయంగా సంపాదించిందని డబ్బు మీద రాసి వుండదు! ఇవన్నీ చేతకాని వాళ్ళ కబుర్లు. ఈ రోజుల్లో ఎలా సంపాదించాడన్నది ముఖ్యమైన సంగతి కాదు. న్యాయంగా ఆర్జించినవాడు ఎన్నో అంతస్థుల భవనాలు కట్టలేడు. కార్లలో తిరగలేడు. ఈ విషయంలో నేను సాంబమూర్తిని అభినందిస్తున్నాను" అన్నాడు ఒక నడివయసు బంధువు.

ఇలాంటి చర్చలే ఇంకొంచెంసేపు జరిగాయి. మళ్ళీ తెల్లవారుజామున లేవాలని నేను కళ్ళుమూసుకుని నిద్రలోకి జారుకున్నాను.

మూడున్నర కావస్తున్నప్పుడు మా ఆవిడ నన్ను నిద్రలేపింది.

మొహం కడుక్కుని నాలుగుగంటలు కావస్తూండగా అందరం మేళాలతో నూతన గృహ ప్రవేశానికి కదిలాము.

సరిగ్గా ముహూర్త సమయానికి మేళాలతో - మంత్రాలతో నూతన గృహ ప్రవేశం జరిగింది.

అంతా లోపలకు వెళ్ళాం.

ఒక్కొక్క గదినే చూస్తున్నాం. ఎంతో అధునాతనంగా బాగానే కట్టించాడు సాంబమూర్తి.

ఇలా తిరుగుతున్నప్పుడే బయట ఏదో విరిగిపడి నట్టు పెద్ద చప్పుడయ్యింది. ఇంతలోనే కేకలు, ఏడుపులు వినిపించి రివ్వున బయటకువచ్చాం.

ఇంకేముంది? డాబామీది ముందువైపు పిట్టగోడ సగంవరకూ విరిగి కింద పడివుంది. దానితోపాటుగా దానిమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న ఇద్దరు

పిల్లలు కిందపడ్డారు.

ఒకడికి తల పగిలిపోయింది- రెండో వాడికి ఒక కాలూ, చెయ్యి విరిగి పోయాయి. ఒకడు సాంబమూర్తి రెండో కొడుకు. రెండోవాడు ఎవరో బంధువుల వాడు.

సాంబమూర్తి భార్య పెద్దపెట్టున శోకాలు మొదలుపెట్టింది.

మ్యా అందరికీ మతిపోయింది. ఎవ్వరం వూహించని సంఘటన.

అప్పటికప్పుడే ఎవరో రెండు రిక్షలను పిలిచారు. వాటిలో ఆ ఇద్దరు పిల్లలను వేసుకుని కొంతమంది డాక్టరు దగ్గరకు వెళ్ళిపోయారు.

"దరిద్రపు కొంప, అప్పుడే బలి కోరింది... ఇంకా నయం ఇల్లు మొత్తం కూలిపోలేదు" అన్నది ఒకామె. ఆమెకు మొదటినించీ ఎందుకో కోపంగానే వుంది.

"కూలిపోదని గ్యారంటీ లేదు. పదిమంది మనుషులు డాబామీదకు ఎక్కారంటే ఇల్లు కూడా కూలిపోతుంది... ఇందులో- అందులో ఇటుకలు- ఇసుక- సిమెంటు మిగుల్చుకొని చాలీచాలకుండా కట్టిన ఇల్లు ఇది... ఐనా అన్యాయంగా సంపాదించింది అంత గట్టిగా నిలుస్తుందా?" అన్నాడొకాయన. ఆయన పదేళ్ళనుంచీ ముగ్గురు కొడుకులు సంపాదిస్తున్నా ఓ ఇల్లు కట్టుకోలేకపోయాడు.

"అవును, నిజమే" అన్నారంతా.

"ఇహ మనం ఈ ఇంట్లో వుండటం మనకు మంచిది కాదు, బలికోరుతుందేమో... పదండి" అన్నాడు ఆయనే మళ్ళీ...

అంతే- క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా అంతా ఇంట్లోంచి బయటకు వచ్చాం...

నాకు ఇదంతా కలగా ఏదో కథగా వుంది. కాని ఇది నిజమే.

ఇంతకీ- గృహంలోకి ప్రవేశించటాన్ని గృహప్రవేశం అంటారు. మరి గృహంలోనించి బయటకు రావటాన్ని ఏమంటారు? గృహ విష్క్రమణం అనొచ్చునా??

*

